# ఒకరి కొకరు

కేశవరావుగారు పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసి రిటైరై వారంరోజులే అయింది. తరువాత ఏం చెయ్యాలా రిటైర్‌మెంటు సమయాన్ని ఎలా గడపాలా అనుకుంటూ రకరకాలుగా ఆలోచిస్తున్నారాయన. రెండు మూడు ఉద్యోగాలకి ఆఫర్లు కూడా వచ్చాయి. జానకమ్మగారికి ఎప్పుడెప్పుడు అక్కణ్ణించి వెళ్లిపోయి ముగ్గురు కొడుకుల దగ్గరా నాలుగేసి నెలల చొప్పున ఉండి రావాలి అని ప్లానేసుకున్నారు. ఆప్లాను విని నవ్వుకున్నారు కేశవరావుగారు.

"మాట్లాడరేమండీ! అలా చేద్దామా?" అడిగింది జానకమ్మ - భర్త సమాధానం తనకి అనుకూలంగా రావాలని ఆశిస్తూ. కేశవరావుగారు మాట్లాడలేదు.

"మన కొడుకులూ, మనకోడళ్ళూ అని చెప్పుకోవడం కాదుకానీ, వాళ్లంతా మనమంటే ప్రాణమిస్తారండీ! నిజానికి మనకి ఆడపిల్లలు లేరన్న కొరతకూడా ఏ మాత్రంలేదు. మన కోడళ్ళు కూడా అంత మంచి వాళ్లు!" అంది జానకమ్మ- ఈసారైనా కేశవరావుగారు 'సరే' అంటారన్న ధీమాతో.

మళ్లీ ఆయన నవ్వి ఊరుకున్నారు.

"ఏమిటండీ నవ్వుతారు, ఉలుకూ పలుకూ లేకుండా?" అడిగింది చిరుకోపంతో.

"నీ అమాయకత్వానికి నవ్వొస్తోంది, జానకీ! ఈ రోజుల్లో ఎవరికీ ఎవరిమీదా ప్రేమలు లేవు. లేదని నిక్కచ్చిగా ఒప్పుకునే వాళ్ళు కొందరైతే, ఉన్నట్టుగా నటించే వాళ్ళు కొందరు. నిజంగా ప్రేమగా వుండేవాళ్లు బహుకొందరు. మనం ఎవరి దగ్గరా ఉండొద్దు. ఎప్పటిలాగే వాళ్ళే వస్తూ పోతూ ఉంటారు." అన్నారు.

"అయితే మన బిడ్డలు నటిస్తున్నారంటారా?"

"నేనేమీ అనను".

"అయితే పదండి. నా ప్లాను ప్రకారం అందరి దగ్గరా నాలుగు నెలలుండొద్దాం."

"సరే అయితే నాకూ ఒక ప్లానుంది. ముందు నా ప్లానయ్యాక నీ ప్లాను."

"ఏమిటో అది?"

"నార్తిండియా టూర్ వెళదాం. మూడు నెలలు కండక్టర్ టూర్ ఆ తరువాత నీ ప్లాను. సరేనా?"

"అట్లాగే."

"ఆ తరువాత?"

"నాకు ఇక్కడే విశాఖలోనే మరో ఉద్యోగానికి ఆఫరొచ్చింది. ఒప్పుకుందాం అనుకుంటున్నాను. ఊరికే ఆ కొడుకు దగ్గరా ఈ కొడుకు దగ్గరా ఉండి ఏం లాభం?"

"బాగున్నారండీ మీరు! జీవితమంతా ఉద్యోగాల గొడవలేనా? కొడుకులూ, కోడళ్ళూ, మనవలతో హాయిగా చీకు చింతా లేకుండా గడపడం మీ కిష్టంలేదా?" కోపంగానే అడిగింది.

"నువ్వన్నట్టు చీకూ చింతా లేకుండా, జీవితం పూలపాన్పులా ఎవరికీ జరగదే!"

"అంటే?

"అందరూ జీవితాంతం వరకూ ఉద్యోగాలు చేసుకుంటూనే ఉన్నారా? ప్రభుత్వం రిటైర్మెంట్ ఇచ్చింది ఎందుకోసం? 'ఇక నువ్వు చేసింది చాలూ! పిల్లా పాపలతో... అదే మనవలూ మనవరాళ్లతో అడుకుంటూ హాయిగా ఉండమని కాదూ? ఇన్నేళ్లు ఆటుపోట్ల కోర్చి చేసింది చాలదూ?" మూతి విరుస్తూ అంది జానకమ్మ.

"జానకీ! అందరికీ జీవితాంతం ఏదో ఒక పని చేసే అవకాశం ఉండకపోవచ్చు. పిల్లలమీద ఆధారపడవలసిన అవసరమూ ఉండొచ్చు. కానీ అనవసరంగా నువ్వన్నావే హాయిగా ఆడుకుంటూ పాడుకుంటూ అని... అలా మాత్రం జరగదు".

"అయితే మీ మొండితనం, మీ మూఢనమ్మకం మీదేనా?"

కేశవరావుగారు జానకమ్మ గారి కోపాన్ని చూసి నవ్వుతూ, సరే.. నీ ఇష్టప్రకారమే కానీ! నాది మూఢనమ్మకమో, ప్రాక్టికల్‌గా ఆలోచించడమో నీకే అర్థమవుతుంది!" అన్నారు.

"అలాగే కానివ్వండి. ముందు మన టూర్ ఎప్పుడు?"

"మళ్లీ నెలలోనే!"

'సరే, .. అక్కణ్ణుంచి రాగానే బయలుదేరుదాం. ముందు పెద్దాడు రాఘవ - సుశీల దగ్గర నాలుగు నెలలుందాం బెంగుళూరులో. తరువాత ఢిల్లీకి రంగా - శివానీల దగ్గరకి, ఆ

తరువాత రాముా - శైలజల దగ్గరికి హైదరాబాదు. అన్నట్టూ...మీరేమీ అనుకోకపోతే నార్త్ ఇండియా టూరు మరీ మూడు నెలలేమిటండీ! రెండు నెలల్లో పూర్తి చేసేసుకుని, పిల్లల దగ్గరకి వెళ్లిపోదామండీ!'అంది బతిమాలుతూన్నట్టుగా.

కేశవరావుగారు నవ్వుతూ, "మీ ఆడవాళ్లందరూ ఇంతేనే! వాళ్లకోసం వాళ్లు బతకరు. చిన్నప్పుడు అమ్మా నాన్నల కోసం, తరువాత భర్తకోసం, ఆ తరువాత కొడుకులూ కూతుళ్ళూ, అంతటితో ఆగక మనవలూ మనవరాళ్ళూ. ఆ అల్లికనుంచి బయట పడలేరు. మళ్లీ మాకు స్వాతంత్ర్యం కావాలంటారు. ఎవరివ్వాలి స్వాతంత్ర్యం? అది ఒకరిచ్చేదా? ఎవరికి వారు వారికి నచ్చిన విధంగా... అంటే ఎవరితోటీ ఏ సంబంధమూ లేకుండా కాదు సుమా! వాళ్లకి ఏం కావాలో అది చేసుకుంటూ ఉండొచ్చుగా!"

"ఏమండోయ్! .. అదేదో ఈ మధ్య తరుచు వినిపిస్తోందే... స్త్రీవాదం అంటూ. అట్లా మాట్లాడుతున్నారు.

"ఉండొచ్చు! స్త్రీవాదం అంటే అదేదో ఎవ్వర్నీ మొగుల్లతో సంసారాలు చెయ్యొద్దని చెప్పడంలా! భర్త పనికిరాని వాడైనా, హింసించేవాడైనా, దుర్మార్గుడూ దుష్టుడూ అయినా అతడి చేతుల్లో హింసలనుభవిస్తూ, ఏడుస్తూ కుమిలిపోతూ, వాక్ స్వాతంత్ర్యం లేకుండా, స్వతంత్రంగా ఆలోచించకుండా, యాంత్రిక జీవనం గడుపుతూ జీవచ్ఛవంలా బతకకండి! మీ ఆలోచనలకు పదునుపెట్టండి! మీ వ్యక్తిత్వాన్ని చంపుకోకండి, మనుషుల్లా బతకండని స్త్రీల తరఫున, స్త్రీలకోసం వాదించే వాదం. అది ఈనాటిదే కాదు, వీరేశలింగం పంతులుగారు, రాజారామ్మోహనరాయ్‌గారు, మహాత్మాగాంధీగారు అందరూ... ఆ మాటకొస్తే స్త్రీవాదులే! స్త్రీలకి విద్యకావాలీ, ఉద్యోగాలు కావాలీ స్వేచ్ఛగా ఆలోచించగలిగే వాతావరణం కావాలీ అని పోరాడినవారే! కొందరు వాటికి పెడర్థాలు తీసి వికృత ప్రచారాలు చేస్తున్నారంతే".

జానకమ్మ చప్పట్లు కొట్టింది.

"ఏమిటి?"

'ఇది వేదిక అనుకుని ఉపన్యాసం ఇస్తూంటేనూ! కాదండీ మనం మాట్లాడుతున్నది మన ప్లాను గురించి అని గుర్తుచెయ్యడానికే చప్పట్లు కొట్టాను!'

"అలాగే! ఈ విసయంలో నీ మాటే పాటిస్తాను" అన్నారు. ఆమె చేతిలో చెయ్యి వేస్తూ.

ఆమె మనసు విహంగంలా ఎగిరిపోతోంది సంతోషంతో.

కానీ విధి చేతిలో అందరూ ఆటబొమ్మలే. వారం తిరక్కుండా కడుపులో ట్యూమర్‌తో ఆసుపత్రిలో చేరిన జానకమ్మ, నెలతిరక్కుండానే కన్ను మూసింది. చేతినిండా డబ్బులున్నా, ఉద్యోగం ఉన్నా, తోడులేని, నీడలేని బికారివాడయి పోయారు కేశవరావుగారు. ముగ్గురు కొడుకులూ తమ దగ్గర్కి రమ్మన్నారు. ముందు పెద్దకొడుకు దగ్గరకే బయల్దేరారు కేశరావుగారు.

రాఘవ బెంగుళూరులో ఒక ఫైనాన్స్ కంపెనీలో మేనేజరు. సుశీల టెలిఫోను డిపార్టుమెంటులో ఎంప్లాయి. బెంగుళూరు వెళ్లాక రాఘవ, సుశీల ఫ్రెండ్స్ళ్లకీ, గుడిగోపురాలకీ బాగానే తిప్పారు కేశవరావుగారిని. బెంగుళూరంతా తిరగడమైపోయింది. ఆ తరువాత కేశవరావుగారికి 'టైమ్' గడవటం కష్టమైపోయింది. రాఘవ, సుశీల ఆఫీసులకెళ్లిపోతారు. కౌశిక్, మానసా స్కూల్‌కెళ్లిపోతారు. ఇంట్లో కనపడ్డ పుస్తకమల్లా తీసి చదివారు కేశవరావుగారు. పిల్లలు సరాసరి స్కూలు నుంచి ట్యూషన్‌కెళ్లి, అందరూ ఒకే సమయానికొస్తారు.

"రోజూ మీకెలా టైంపాసవుతోంది?" అడిగింది సుశీల.

"ఎన్ని పుస్తకాలు చదివినా, పేపర్లు చదివినా, టీ.వీ. చూసినా పొద్దు గడవడంలేదు. అదే మీ అత్తయ్యుంటే, దేనికోదానికి తగువు పడుతూ, సర్దుకుంటూ ఎలాగో కాలక్షేపం అయిపోయేది" బాధగా అన్నారు కేశవరావుగారు.

"ఒక పని చెయ్యండి మావయ్యగారూ! రేపట్నుంచి కౌశిక్, మానసలతో వాళ్ల స్కూలుకి వెళ్లి, అక్కడే ఉండి వాళ్లతో పాటు టిఫిన్ చేసి వాళ్లని తీసుకురండి. ట్యూషను మానిపించేస్తాను. మీరే వాళ్లకు పాఠాలు చెప్పండి. రిక్షాలో ముగ్గురు పట్టరు. కాస్త త్వరగా వెళితే నడిచి వెళ్ళొచ్చు. వచ్చేటప్పుడు నడిచి రావచ్చు. ఎక్సర్‌సైజ్ కూడా అయిపోతుంది' ' అంది గొప్పగా సలహా ఇస్తూ సుశీల.

"అలాగేనమ్మా! నువ్వు చెప్పింది కరెక్టే..." అంటూ వెళ్లి వీధి అరుగుమీద కూర్చున్నారాయన.

"సుశీ! ఏమిటి నాన్నగారికివన్నీ చెబుతున్నావు? ఆయనకి ఈ వయసులో ఇటువంటి బాధ్యతలుండకూడదు. మన పిల్లల బాధ్యత మనం చూసుకోవాలిగానీ ఆయన నెత్తిన రుద్దకూడదు. ఆయనని ఇక్కడికి తీసుకొచ్చింది ఆయన మానసిక విశ్రాంతి కోసం కానీ మనకి పనులు చేసిపెట్టడానికి కాదు!"

"బాగుందండీ మీ వరస! ఆయనేదో పరాయివాడయినట్టు ఆయనకేమీ పనులు చెప్పకూడదంటారేమిటి? ఆయన మంచికీ, మనమంచికీ కలిసొస్తుందని చెప్పానంతే! ఊరికే

టీ.వీ. చూస్తూ, పేపరు చదువుతూ కూర్చున్నచోటే కూర్చుంటే ఆయన ఆరోగ్యానికే మంచిది కాదు. అయినా మీరూరుకోండి. అంతా నే చూసుకుంటాను" విసురుగా అంది సుశీల.

అప్పుడే లోపలికొస్తున్న కేశవరావుగారు వీరి మాటలు విన్నారు. చిన్నగా దగ్గి లోపలికొచ్చారు. "మంచి నీళ్లు కావాలి" అంటూ.

రాఘవ లోపలికెళ్లిపోయాడు. సుశీల మంచినీళ్లిచ్చి వంటింట్లో కెళ్లిపోయింది.

పిల్లల్తో పొద్దున్నే తయారై ఆదరాబాదరాగా కాస్త టిఫిన్ తిని పిల్లలతో పాటుగా టిఫిన్ డబ్బాలో కాస్త అన్నం పెట్టుకుని స్కూలుకి బయల్దేరారు కేశవరావుగారు. "ముగ్గురికీ మూడు డబ్బాలేమిటి అనవసరంగా! 'చక్కగా నాలుగు గిన్నెల కారియరుంది. అది తీసికెళితే ముగ్గురూ తినొచ్చును!" అంటూ క్యారియర్ వాటర్ బాటిల్స్, గ్లాసులూ అన్నీ ఒక బ్యాగ్‌లో పెట్టిచ్చింది సుశీల.

ఆ బ్యాగుపట్టుకుని బయల్దేరారు. నడిచి వెళ్లే సరికి సరిగ్గా స్కూలు టైమయ్యేది. బెల్ కాగానే క్లాసుల్లోకి వెళ్లిపోయేవారు పిల్లలు. కేశవరావుగారు స్కూలు పక్కగా వున్న పార్కులో కూర్చుని పేపర్లు చదువుకునేవారు. ఎలాగో ఒంటి గంట అయ్యేది. పిల్లలు రాగానే లంచ్ అవర్‌లో అందరూ టిఫిన్ క్యారియర్ తెరిచి ఏ చెట్టుకొందో తినేసి మళ్లీ వాళ్లు క్లాసులోకెళ్లిపోయేవారు. అప్పటినుంచి కేశవరావుగారుగారికి నిమిషమొక యుగంలా గడిచేది. కాస్సేపు అలా నడుం వాల్చడానికి కూడా వీల్లేదు. ఎంతసేపని చదువుతారు! అలా పార్కులో తిరిగేవారు గతాన్ని నెమరేసుకుంటూ.

'ఇదొక రకమైన బందిఖానా! మమకారం పేరిట బిడ్డలు వేసిన సంకెళ్లు.' అనుకుంటూ కూర్చునేవారు. సాయంత్రం పిల్లలు బయటికి రాగానే టిఫిను క్యారియర్ బుట్టపట్టుకుని ఇంటికొచ్చి, పిల్లలచేత హోంవర్కు చేయించి, ఏవో రెండు ముద్దలు తిని నిద్రపోయేవారు. రెండ్రోజులు గడిచేసరికి పిచ్చెత్తినట్టయింది కేశవరావుగారికి. భోజనాలై పిల్లలు క్లాసులో కెళ్లాక, ఇక పార్కులో కూర్చోలేక అలా నడక మొదలెట్టారు - పిల్లలు ఇంటికొచ్చే బెల్ కొట్టేసరికి బడికి చేరుకోవచ్చులే' అని. కానీ, ఆరోజు ఆ బళ్లో రిటైరైన ఒక టీచరు పోవడంతో మధ్యాహ్నం నుంచి బడికి సెలవు ఇచ్చేశారు. కేశవరావుగారు నాలుగింటికి బడికి తిరిగొచ్చి విషయం తెలుసుకుని బడి అంతా గాలించారు. ఇంటికెళ్లిపోయారేమోనని ఇంటికొస్తూ దారిలో పనిమనిషి నర్సమ్మ కనబడితే "ఏమే పిల్లలొచ్చేశారా?" అని అడిగారు.

"నాను సూడలేదయ్యా. ఒచ్చినట్టు లేరు" అంటూ వెళ్లిపోయిందది! కేశవరావుగారి గుండె యమవేగంగా కొట్టుకుంది. మళ్లీ వెనక్కెళ్లి బడి, పార్కు అంతా చూశారు."ఒకవేళ

యింటికే వెళ్ళి ఉండవచ్చు" ఈ పని మనిషి చూడలేదేమో! అంతగా రాకపోతే రాఘవతో చెప్పి పోలీసు రిపోర్టిప్పించవచ్చు" అనుకుని గబగబ ఆటో ఎక్కి ఇంటికొచ్చారు.

లోపల్నుంచి అరుపులు వినిపిస్తున్నాయి. అనుకోకుండా కేశవరావుగారి కాళ్లు అడుగులు వెయ్యక ఆగిపోయినాయి.

"పిల్లల్నలా వదిలేసి ఎక్కడికెళ్లిపోయారాయన బాధ్యత లేకుండా?" అరుస్తోంది సుశీల.

"నేను ముందే చెప్పానా? ఇటువంటి పనులు ఆయనకి చెప్పకూ! ఆయనెప్పుడూ చెయ్యలేదని!"

"తప్పేముందండీ! మొన్న ఇంట్లో తోచడంలేదని పక్కింటి సుందరమ్మ గారింట్లో గంటలకొద్దీ కబుర్లు చెబుతూ కూర్చున్నారట. ఎదురింటామె చూసిందట. మేడమీద రమాదేవి ముందర ఈ సంగతి చెబుతూ ఒకటే నవ్వు! రేపు నలుగురూ నానారకాలుగానూ అనుకుంటారు. భార్య పోయి నెలతిరక్కుండానే అలా పరాయి అడవాళ్లతో మాట్లాడితే 'చాపల్యం' అనుకోరూ?' అంది.

"సుశీలా!" పులిలా అరిచాడు రాఘవ.

"ఎందుకరుస్తారు. ఉన్నమాట చెప్పినందుకా? రిటైరైన తరువాత ఇట్లాంటి ఆడస్నేహాలు మొదలైతే, వచ్చిన పెన్షన్ డబ్బులు నాలుగూ ఎవతో లాగేసుకుంటుంది" అంది ప్రతి అక్షరం నొక్కి పలుకుతూ.

"ఛీ ఛీ! పాడుబుద్ధీ, పాడు ఆలోచనలూనూ! మా నాన్న అటువంటి వారు కాదు."

"అబ్బో! .. మీ నాన్న శ్రీరామచంద్రుడు, మీ అమ్మ అపర జానకమ్మ"

"సుశీ!".. కోపంతో చెయ్యెత్తి "ఛీ" అంటూ చెయ్యి దించుకున్నాడు రాఘవ.

తలుపుచాటునుంచి అంతా వింటూ చూస్తున్న కేశవరావుగారు, ఇక వినలేక, అలా పచార్లు చేస్తూ తిరుగుతున్నారు.

రెండు రోజుల తరవాత సూటుకేసు సర్దుకుంటున్న కేశవరావుగారిని చూసి, "ఎక్కడికెళుతున్నారు మామగారూ?" అడిగింది సుశీల.

"నాలుగు రోజులు రంగా దగ్గరుండొద్దామని"

"అప్పుడేనా? ఇక్కడ మీకు కష్టంగా ఉందా?

"లేదమ్మా.. కానీ.. నాలుగేసి రోజులు వాళ్ల దగ్గరా ఉండొస్తాను.'

సుశీల దిగులుగా చూసింది. ఆ దిగులులో అతనికి ఆప్యాయత కనిపించలేదు. పిల్లలకి రిక్షావాడు, ట్యూషన్ మాస్టార్లు, పెన్షన్ డబ్బులూ కనిపించాయి.

"దిగులుపడకమ్మా సుశీలా!.. జాగ్రత్త.. వెళ్ళొస్తాను' బయల్దేరారాయన ఢిల్లీకి.

*　　*　　*

ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకున్నారు రంగారావు - శివానీలు. రంగా భారత్ గ్యాస్ కంపెనీలో మేనేజరు. శివానీ ఎం.ఎ. చేసినా ఉద్యోగం చేయడంలేదు కానీ, ఎన్నో సంస్థలలో ఆనరరీ మెంబరు. సోషల్ వర్కరు. వర్ష- వాళ్ల గారాల పట్టి. నాలుగేళ్లది. లోయర్ కే.జీ.

రంగా శివానీల దగ్గర ఏ పనీలేదు. నెలరోజులు ఢిల్లీ అంతా తిరిగారు కేశవరావుగారు, అనుక్షణం జానికిని తలుచుకుంటూ.

"మామయ్యగారూ! నేను అర్జెంటుగా 'లేడీస్‌క్లబ్' మీటింగ్‌కెళ్ళాలి. సూపర్ బజార్‌కెళ్లి ఈ సరుకులూ కూరలు తెచ్చిపెట్టరూ!" వందరూపాయలనోటు అందిస్తూ అడిగింది శివాని.

"అలాగేనమ్మా" అంటూ నోటు తీసుకుని బయల్దేరారు. ఆ లిస్టు ప్రకారం సామాన్లు రెండు వందల యాభై అయ్యాయి. మరోరోజు వర్షకి పళ్లు తెమ్మంది. ఒక రోజు షుగరూ, మరో రాజు మసాలపొడి... ఇలా చెప్పేసి వెళ్లిపోయేది డబ్బివ్వకుండానే.

ఆరోజు పొద్దున్నే పాలకోసం వెళ్లి పాలప్యాకెట్లతో అడుగుపెడుతూన్న కేశవరావుగారు హాల్లోంచి గట్టిగా మాట్లాడుతున్న శివాని కంఠం విని ఆగిపోయమారు. అది తన విషయం కనక అలా ఆగిపోయారు.

"అవును, సుశీలా! నేనలా అతని చేత ఖర్చుపెట్టించకపోతే, అతడు 'ఏరెడ్‌లైట్ ఏరియాకో పోవచ్చు. లేదా ఏ రేసు గుర్రం పైనో పందెం కాయవచ్చు." పెద్దగా అంటోంది శివాని పకపకా నవ్వుతూ..

" . . . . . "

"ముసలాయన ఉప్పు పులుసూ తింటూ దిట్టంగానే వున్నాడు కదా! తల పండింది, తలపులు పండాయో, లేదో?" మళ్లీ నవ్వు..

పాలప్యాకెట్లు లోపల పెట్టేసి, ఇంట్లో ఉండబుద్ధికాక బయటికెళ్ళిపోయారు వాకింగ్‌కని.

ఆ మర్నాడే రంగాకి, శివానికీ చెప్పి నాలుగు రోజులు రామూ శైలజల దగ్గర ఉండొస్తానని చెప్పి హైద్రాబాదుకు వెళ్లిపోయారు.

* * *

రామూ, శైలజ బాగానే చూసుకుంటున్నారు. పిల్లలు శ్వేతా, స్వాతీ ఉన్నంతవరకూ 'తాతయ్యా తాతయ్యా!' అంటూ క్షణం వదలడంలేదు. రామూకీ, శైలజకీ పుస్తకాలంటే ఇష్టమవడం వల్ల ఇంట్లో మంచి లైబ్రరీ వుంది. కేశవరావుగారికి మంచి కాలక్షేపంగా టైము జరిగిపోతోంది.

ఒకరోజు పక్కింట్లోంచి పెద్ద పెద్ద కేకలు వినబడడంతో కిటికీలోంచి తొంగి చూశారు. ఫ్లాట్స్‌లో వీళ్ల వంటింట్లోంచీ, బెడ్‌రూంలోంచీ పక్కవాళ్ల వంటిల్లూ, బెడ్‌రూమూ కనిపిస్తాయి. అత్తాకోడళ్ళ దెబ్బలాట. అత్తగారు ఏడుస్తోంది. కోడలు అరిచి అరిచి తను తయారైపోయి, ఆఫీసుకెళ్లిపోయింది. కొడుకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతనూ ముస్తాబై ఆఫీసు కెళ్లిపోయాడు. పాపం అత్తగారు ముసలావిడ అలాగే ఏడుస్తూ మూల కూర్చుండిపోయింది.

కేశవరావుగారి గుండె తరుక్కుపోయింది. ఆడవాళ్లకి చదువూ, స్వంత సంపాదనా ఎంత అవసరమో అర్థమైంది. భర్త సంపాదించి తెచ్చేవరకు ఆమె బతుకు బాగానే సాగుతుంది. ఇప్పుడు కొడుకులనడగలేదు. వారి దయాదాక్షిణ్యాల మీద బతకాలి. వారిని కాదంటే ఆ కాస్త నీడా పోతుంది. తను మాత్రం ఏం చేశాడు.

జానకి పేరుమీద కాస్తయినా వెనకెయ్యలేదు. ఆమెకంటూ ఏర్పాటు చెయ్యలేదు. చదువులేకపోయినా జానకి "ఏమండీ! నాకోసం మీరు ఏదైనా ఏర్పాటుచెయ్యండి నెలకొక వెయ్యి రూపాయలొచ్చేట్టు" అంటే నవ్వుతూ కొట్టిపారేసేవాడు-"నీకిప్పుడు డబ్బెందుకు? నేను నీకేది కావాలన్నా తెచ్చివ్వడంలా?" అంటూ.

ఆడవాళ్లకి స్వతంత్రంగా బతకడం నేర్పించాలి. అది చాలా అవసరం. ఆర్థికంగా ఆడది ఒకరిపై ఆధారపడే విధానాన్ని మార్చాలి! ఒకవేళ తనుపోయి జానకి బతికుంటే, ఇలాంటి సంఘటన జరిగితే, జానకి తట్టుకోగలిగేదా?

ఆలోచనలతో సతమతమయిపోతూ, ఆమెని పిలిచి ఓదార్చాలను కున్నారు. కానీ. అంతలోనే పెద్దకోడలి మాటలు జ్ఞాపకమొచ్చి 'చాపల్యం అంటూ వెనక్కి తగ్గారు.

అంతలోనే ఆమె తలుపు తీసుకుని బయటికొచ్చింది. "ఏ అఘాయిత్యం చేసుకుంటుందోనని కేశరావుగారు కూడా బయటికొచ్చారు. ఆమె కళ్లు ఎర్రగా ఉల్లిపాయల్లా వున్నాయి. మనిషి నీరసంగా వుంది.

"ఏమండీ! మిమ్మల్నో విషయం అడుగుతాను చెప్తారా" అంది.

"అడగండి, పరవాలేదు"

"ఇక్కడెక్కడయినా మంచి వృద్ధుల శరణాలయా లున్నాయేమో తెలుసా?"

'మీ కోసమా?'

"అవును"

'. . . . . '

"ఏమిటి సందేహిస్తున్నారు. నేను డబ్బులేని దాన్ని కాను. మావారు విజయవాడ గవర్నర్‌పేటలో రెండంతస్థుల మేడ నా పేరనే రాశారు పాపం! అయిదు వేలు అద్దె వస్తోంది. అమ్మాయికి రెండువేలూ అబ్బాయికి రెండువేలూ ఇచ్చి, ఒక వెయ్యి నా ఖర్చులకని ఉంచుకుంటాను. అయినా 'బాతూ బంగారుగుడ్డూ' కథలాగా వాళ్లకి తృప్తి లేదు. కొడుకుని విదేశాలకి పై చదువులకి పంపాలని ఇల్లు అమ్మేయమంటున్నారు. అమ్మాయీ, అల్లుడూ. మరో మంచి ఇల్లు జూబ్లీహిల్స్‌లో కొనుక్కుంటారట ఇల్లమ్మేయ్యని పోరుతున్నారు కొడుకు కోడలూ..! నేను బతికుండగా ఆ ఇల్లు అమ్మేయడం నాకిష్టంలేదు. అదీ గొడవ..!'

ఆశ్చర్యపోయారు కేశవరావుగారు! ఆర్థికంగా ఈవిడ బాగానే ఉన్నారు. అయినా ఒంటరితనమూ, అశాంతీ అనుభవిస్తున్నారు. ఆమె ఎవ్వరికీ అక్కరలేదు. ఆమె డబ్బు అందరికీ కావాలి. ఆప్యాయత కరువైపోయింది. ఆర్థిక దన్ను వుంది. కాస్త ధైర్యంగా ఒంటరిగానే బతకడం అలవాటు చేసుకుంటే చాలు.

"అంత ఉండి కూడా మీరిలా అంట్లు తోముతూ, వాళ్లు పెట్టింది తింటూ పడుండడం ఆశ్చర్యంగా ఉంది!'

"అవును. కన్నబిడ్డలకి సాయపడడం ఊడిగం చెయ్యడం కాదనుకున్నాను. అందుకే ఇలా ఉన్నాను." అందామె కళ్లుతుడుచుకుంటూ!'

"రండి. లోపలకి! కాఫీ తాగుదురుగాని."

ఆమె లోపలికొచ్చింది మొహమాటపడుతూనే..

"శైలజా!.. అమ్మా శైలజా" .. పిలిచారు.

బయటికొచ్చిన శైలజ ఆమెని అదోలా చూసింది.

"ఈమె మన పక్కింట్లోనే ఉంటారు" అంటూ ఏదో చెప్పబోయేలోపలే 'నా పేరు మహాలక్ష్మి. ఊర్మిళ నాకోడలు. డా॥ ప్రశాంత్ మా అబ్బాయే. మీరు వాళ్లతో మాట్లాడుతూంటే చూశాను. అందుకే అలా పరిచయం చేసకుంటున్నాను.'అందావిడ.

"నాకు తెలీదు మీరు పక్కనే ఉన్నా. మా మామగారు భలే పట్టేశారే" అంది వ్యంగ్యంగా.

ఆ మాటల్లోని వ్యంగ్యం ఇద్దరూ గ్రహించారు. కేశవరావుగారు తమాయించుకుని, "శైలజా! పొద్దుటి నుంచీ ఏదో గొడవల్లో పడి వారు కాఫీ కూడా తాగలేదట! కాస్త కాఫీ ఇవ్వు!" అన్నారు.

రివ్వున వెళ్లి నిమిషంలో కాఫీ పట్టుకొచ్చి ఇచ్చి, మహా అర్జంటు పనున్నట్టుగా లోపలికెళ్లిపోయింది శైలజ.

కాఫీ తాగి కప్పు కింద పెడుతూ, "కోడలితో చెప్పండి. నేను వెళ్లొస్తాను! నేను చెప్పింది కాస్త గుర్తుంచుకోండి! అంటూ వెళ్లిపోయిందామె.

"ఏమిటో ఈ కలికాలం! డబ్బున్నవాళ్లకీ సుఖంలేదు. లేనివాళ్లకీ సుఖంలేదు. అభిమానాలూ, అప్యాయతలూ అంతరించిపోయాయి!" అనుకుంటూ లోపలికెళ్లబోతున్న కేశవరావుగారు శైలజ మాటలు విని ఆగిపోయారు.

"ఇంత వయసొచ్చినా ఈయనకిదేం బుద్ధి? పక్కింటి మహాలక్ష్మిగారితో ఒకటే కబుర్లు ఏదో బంధువుల్లాగా! ఏకంగా ఇంటికి కాఫీకి పిల్చేశారు! రేపు.."

"ఛీ! నోర్మూయ్'... మానాన్న అలాంటి వారు కాదు."

"ఆఁ చూశానుగా! సుశీలక్క చెప్తే నమ్మలేదు!"

"శైలజా.." అరిచాడు రాము కోపంగా.

"అయినా నాకెందుకులెండి. " ఏదో చెప్పానంతే!"

"........."

కేశవరావుగారికి గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టయింది. అడుగు ముందుకు పడక వెనక్కొచ్చి వాలుకుర్చీలో వాలిపోయారు. 'జానకీ! చూశావా? నువ్వూ నేనూ ఒకళ్ళకొకళ్ళం తోడుగా ఉండేవాళ్లం. నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయావు. చిన్నప్పుడు అమ్మా, నాన్నా - పెద్దయ్యాక భార్యాభర్తలు, ఒంటరి వారికి స్నేహితులు... ఇలా ఎప్పుడూ అందరికీ ఒక తోడు అవసరం." కుర్చీలో కూర్చునే ఆలోచనల్లో మునిగిపోయారు కేశవరావుగారు.

* * *

వరంగల్‌లో వయోజనులకు వెలిసింది 'మహాలక్ష్మి ఆశ్రమం.' స్త్రీపురుషులందరికోసం అన్ని సదుపాయాలతో వెలిసింది. వంటవాళ్ళూ, డాక్టర్లు, టీ.వీ. అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేశారు కేశవరావుగారు. మహాలక్ష్మమ్మగారు ప్రత్యేకంగా అందరి యోగ క్షేమాలూ కనుక్కుంటారు. డబ్బివ్వగలిగిన వాళ్లందరికీ 'ఎ' క్లాసు రూములు. కొంచెం అవతలగా అవుట్ హౌసులో డబ్బు ఏ మాత్రం ఇచ్చుకోలేని వారికి ఉచిత వసతి!

మానవ సంబంధాలు మరుగు పడిపోతున్న ఈరోజుల్లో అదొక మానవాలయం! ఎందుకనో ఆరోజు జానకమ్మ తరచు జ్ఞాపకం వచ్చింది కేశవరావుగారికి .

"జానకీ! నువ్వుపోయిన రోజున నేనెంతో బాధపడ్డాను నువ్వులేవని. కానీ ఈరోజున నువ్వు నా చేతుల మీదుగా పోయినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. నేను పోయి నువ్వుంటే నువ్వీ బాధలు పడలేక పోయేదానివి. ఈ వాతావరణంలో నువ్విమడలేవు జానకీ! ప్రేమించడం తప్ప, ద్వేషించడం తెలీని నీకు ఈ పరిస్థితి అర్థం కాదుకూడా! జానకీ! నువ్వెంత మంచిపని చేశావ్? హాయిగా నా చేతుల్లో పువ్వులా వెళ్లిపోయావు. నీ జ్ఞాపకాలతో బతుకుతున్నాను నేను. త్వరలోనే నిన్ను చేరుకోవాలనుకుంటున్నాను జానకీ! వచ్చేస్తాను నీదగ్గరికి! ఎందుకనో ఈ మధ్యన నువ్వు మరీ గుర్తుకొస్తున్నావు. అంత శూన్యంలోనూ నీ నవ్వే నాకు ప్రాణం పోస్తోంది'..

కేశవరావుగారు వాలు కుర్చీలో వాలిపోయారు! సుదీర్ఘ నిద్రలోకి జారిపోయారు! తన జనకిని వెతుక్కుంటూ వెళ్లిపోయారు!

* * *